బహుభాషా కోవిదుడు.. భావనారాయణరావు

● శతజయంతి ప్రారంభోత్సవ సభలో వక్తలు

ప్యారీస్, సెప్టెంబరు 8: కవితలు, నాటికలు, పద్యాలు, సినీగేయాలు ద్వారా చరిత్రలో నిలిచిపోయిన చిల్లర భావనారాయణరావు బహుభాషాకోవిధులని పలువురు వక్తలు కొనియాడారు. చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో మైలాపూర్ భారతీయ విద్యాభవన్‌లో భావనారాయణరావు శతజయంతి ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. కిడాంబి లక్ష్మీకాంత్ ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ సభకు సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా.తూమాటి సంజీవరావు అధ్యక్షత వహించారు. ఆయన అతిథులతో కలసి భావనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాదుకు చెందిన ప్రసిద్ధ కవయిత్రి చిల్లర భవానీ దేవి మాట్లాడుతూ భావనారాయణరావుతో తనకు అక్షర బంధం ఉందన్నారు. కవిగా, నాటక రచయితగా, ఆధ్యాత్మిక గీతాలు, పద్యాలు, సినీ గేయాలు రాయడంలో ఆయన మహాదిట్ట అని కొనియాడారు. చెన్నై నగరంలో అడుగుపెట్టిన క్షణం నుంచి ఆయన జీవితం గొప్ప మలుపు తిరిగిందని, ఆయన రాసిన సినీగేయాలు, ఆధ్యాత్మిక రచనలు అనతికాలంలోనే ప్రాచుర్యం పొందాయన్నారు. మంచి రచనలతో పాఠకుల అభిమానాన్ని చూరగొని దివంగతులైన కవులు భౌతికంగా మన మధ్య లేకపోయినా వారి రచనలు సజీవంగా ఉన్నాయన్నారు. రైల్వేలో ఉద్యోగం చేసిన ఆయన చిన్నప్పటి నుంచే భాగవతం నేర్చుకోవాలన్న మక్కువతో పలు భాషల పుస్తకాలు చదివారని, ఓ టీచర్ వద్ద ఉర్దూ కూడా నేర్చుకున్నారని తెలిపారు. నిజాం పాలకుల వైఖరిని ప్రజలు అర్థం చేసుకొనేలా ఆయన దేశద్రోహులు అని తొలి నాటకం రాశారని, కృష్ణవేణి, ఉమర్‌ఖయ్యాం నాటకాలకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయనను గౌరవించిందన్నారు. విశిష్ట అతిథి కమలాకర ఆనంద శివరామ్ మాట్లాడుతూ... మద్రాసు నగరంతో భావనారాయణరావుకు మంచి సంబంధాలున్నాయని, ఆయన రాసిన సినిమా పాటలకు అవార్డులు కూడా వరించాయన్నారు. లక్ష్మీకటాక్షం, విక్రమార్క విజయం, సీతారామ వనవాసం తదితర సినిమాలకు పాటలు, సంభాషణలు రాసి తెలుగు భాషకు మరింత వన్నె చేకూర్చారని అన్నారు. కార్యదర్శి తిరునగరి భాస్కర్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.


భవానీదేవి, ఆనందశివరామ్, లక్ష్మీకాంత్, కళాధర్‌లను సత్కరిస్తున్న తూమాటి సంజీవరావు



నడిగర్ సంఘం సర్వసభ్య మండలి తీర్మానాలను వివరిస్తున్న నాజర్ - ఢిల్లీ గణేష్, విజయకుమారిలను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న నడిగర్ సంఘం

రజనీ, కమల్‌తో స్టార్ నైట్స్

● ఢిల్లీ గణేష్, విజయకుమారికి సత్కారం
● పదిమంది కళాకారులకు శంకరదాస్ అవార్డులు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సినీ కళాకారుల సంఘం (నడిగర్ సంఘం) చేసిన రుణాలను త్వరగా తీర్చేలా సినీ దిగ్గజాలు కమల్‌హాసన్, రజినీకాంత్‌తో స్టార్‌నైట్స్ నిర్వహించనున్నట్లు సంఘం కోశాధికారి నటుడు కార్తీ ప్రకటించారు. ఆ సంఘం 68వ సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు నాజర్ అధ్యక్షతన ఆదివారం కామరాజర్ అరంగంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి విశాల్, ఉపాధ్యక్షులు కరుణాస్, పూచ్చి మురుగన్, సభ్యులు లతా, సేతుపతి, సోనియా, పసుపతి, రాజేష్, కోవై సరళ, కాళిముత్తు, హేమచంద్రన్, శరవణన్, అజయ్ రత్నం తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రధాన కార్యదర్శి విశాల్ సైకిల్‌పై వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సభలో సీనియర్ నటులు ఢిల్లీ గణేష్, సీఆర్ విజయకుమారిలను జీవన సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సీనియర్ కళాకారులు కాత్తాడి రామ్మూర్తి, పసి సత్యా, అళగు, ముత్తుకాళై, ఎస్‌సీ కళావతి, ఎం.కళావతి, ఎంఆర్ సోలై, వళ్ళి, ఎం.కామరాజ్, ప్రసాద్, వీసీ రాజేంద్రన్, ఎంప్రకాష్‌కు తమిళ రంగస్థల పితామహుడు శంకరదాస్ స్వామి పేరిట అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ భారతదేశంలోనే అత్యున్నతమైన భవన సముదాయంగా నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 2025లో నడిగర్ సంఘం సర్వసభ్య మండలి సమావేశం జరుగుతుందని సభ్యుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. సంఘం కార్యదర్శి కార్తీ మాట్లాడుతూ నడిగర్ సంఘాన్ని రుణభారం నుంచి కాపాడే దిశగా ఉలగనాయకన్ కమల్‌హాసన్, సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో స్టార్‌నైట్స్ జరుపనున్నామని, ఈ విషయమై ఆ ఇద్దరు నటులు తమ అంగీకారం తెలిపారన్నారు. ఆ తర్వాత ఈ సభలో సినీ నిర్మాతలు నటీమణులకు షూటింగ్ సందర్భంగా దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గది, టాయిలెట్లు, వసతిగృహం వంటి సదుపాయాలు కల్పించాలని తీర్మానం చేశారు. నడిగర్ సంఘం కోసం విశాల్ రూ.4,47,500లు, కార్తీ రూ.5,34,500 విరాళంగా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం చేశారు. నటుడు విజయ్ నడిగర్ సంఘం కొత్త భవననిర్మాణం కోసం రూ.కోటి విరాళంగా ఇచ్చారని, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నటుడు కరుణాస్ మాట్లాడుతూ దిండుగల్ జిల్లాలోని తనకున్న ఐదెకరాల స్థలాన్ని నిరుపేద వృద్ధ కళాకారుల వసతిగృహాల కోసం ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మాలీవుడ్‌లో కలకలం రేపిన హేమా కమిటీపై కూడా సమగ్రంగా చర్చలు జరిపారు.

సమైక్యతను చాటిచెప్పండి

● ప్రవాస తమిళులకు స్టాలిన్ పిలుపు
● చికాగో సభలో అపూర్వ స్వాగతం


చికాగో సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వివిధ దేశాల్లో స్థిరపడిన ప్రవాస తమిళులంతా తమిళ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ సమైక్యతను ఎలుగెత్తి చాటేలా ఇతరుల పట్ల సహనంతో మెలగాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. చికాగో నగరంలో శనివారం రాత్రి చికాగో తమిళ సంఘాల సమాఖ్య, ప్రవాస తమిళుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తమిళులతో ఆత్మీయ భేటీ పేరుతో ప్రత్యేక సభ జరిగింది. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు స్థానిక కళాకారులు తమిళ ప్రాచీన వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. రెండు వేలమందికిపైగా ప్రవాస తమిళులు సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాలిన్ ప్రసంగిస్తూ చికాగో నగరంలో ఇన్నివేలమంది ప్రవాస తమిళుల మధ్య గడపటం చూస్తుంటే తనకు తమిళనాడులో ఉన్నట్లే అనిపిస్తోందన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పెట్టుబడుల సమీకరణ కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్, సింగపూరు, స్పెయిన్ దేశాల్ల పర్యటించానని, ప్రస్తుతం అగ్రరాజ్యమైన అమెరికాకు లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చానని సభికుల చప్పట్ల మధ్య తెలిపారు. ఈ చికాగో నగరంలోనే మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి 1971లో పర్యటించారని, న్యూయార్క్‌కు వెళ్ళి అక్కడ న్యూయార్క్ తమిళ సంఘాన్ని కూడా ప్రారంభించారని స్టాలిన్ వివరించారు. భారతదేశంలోనే పరిశ్రమలకు అనువైన రాష్ట్రం తమిళనాడేనని విదేశీ పారిశ్రామికవేత్తలు సైతం చెబుతుంటే తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. వివిధ కారణాలతో విదేశాల్లో స్థిరపడిన తమిళులంతా యేడాదికొకమారు మాతృభూమిలో పర్యటించాలని, తమ రాష్ట్రంలోని ప్రజలకు వీలైనంత సహాయసహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సభలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, చికాగో నగర డిప్యూటీ రాయబారి సోమనాథ్ ఘోష్, ప్రవాస తమిళుల సంక్షేమ బోర్డు చైర్మన్ కార్తికేయ శివసేనాపతి, ఫెట్నా సహా 37 తమిళ సంఘాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎన్‌వై మెల్లోన్ అధికారులతో భేటీ..

చికాగోనగరంలోని బీఎన్‌వై మెల్లోన్ (ది బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్ మెల్లోన్ కార్పొరేషన్) సీనియర్ అధికారులతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తమిళనాట పెట్టుబడులు పెట్టేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, బీఎన్‌వై మెల్లోన్ డిప్యూటీ చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఐ డివిజన్ హెడ్ సార్థక్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చికాగోలో బీఎన్‌వై మెల్లోన్ బ్యాంక్ అధికారులతో సీఎం చర్చలు

విజయ్ పార్టీకి ఈసీ గుర్తింపు

● మహానాడుకు పోలీసుల గ్రీన్‌సిగ్నల్

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రికళగం (టీవీకే)కు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ప్రకటించిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తెలిపారు. ఈ విషయం తెలియగానే పార్టీ శ్రేణులంతా పండుగ జరుపుకున్నారు. కడలూరు వండిపాళయం అంకాళమ్మన్ కోవిల్, మంజకుప్పం దర్గా, సెమ్మండలం మేరీమాత ఆలయంలో బుస్సీ ఆనంద్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రార్థనలు, పూజలు చేసి, పార్టీ శ్రేణులకు లడ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా సేవలందించిన విజయ్ అభిమానులు, అభిమాన సంఘాలు ప్రస్తుతం పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, పార్టీ కార్యకర్తల సంఖ్య కూడా రోజురోజుకూ అధికమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీని ఈసీ అంగీకరించడం సంతోషదాయకమన్నారు. ఈసీ పార్టీకి అంగీకారం ప్రకటించిన సమయంలో ఈ నెల 23న విక్రవాండి వద్ద జరుపనున్న మహానాడుకు పోలీసుల అనుమతి కూడా లభించడం పార్టీ శ్రేణులకు లభించిన డబుల్ ధమాకా అని చెప్పారు. పార్టీ జిల్లా నేతలు శీను రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విల్లుపురం జిల్లా విక్రవాండిలో ఈ నెల 23న జరిగే తమిళగ వెట్రి కళగం తొలి మహానాడుకు పోలీసు శాఖ అనుమతిచ్చింది. మహానాడు ప్రాంతం వద్ద వేదిక ప్రాంతం, వాహనాల పార్కింగ్ స్థలాలకు సంబంధించిన ప్లాన్ వివరాలను ముందుగా అందించాలన్న నిబంధనతో ఈ అనుమతినిచ్చారు.


పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి రావటంతో సందడి చేస్తున్న టీవీకే పార్టీ శ్రేణులు

రక్తమోడిన రోడ్లు

● వేర్వేరు ప్రమాదాల్లో 9 మంది మృతి

పెరంబూర్, సెప్టెంబరు 8: రాష్ట్రంలో సంభవించిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సహా 9 మంది మృతి చెందగా, మరి కొందరికి గాయాలయ్యాయి. రామనాథపురం జిల్లా కడలాడి ప్రాంతానికి చెందిన రాజేష్ (33)-పాండిసెల్వి దంపతులకు దర్శినిరాణి (8), ప్రణవిక (4) అనే కుమార్తెలు, 12 రోజుల మగబిడ్డతో తంగచ్చిమఠంలో నివసిస్తున్నారు. 12 రోజుల క్రితం జన్మించిన మగబిడ్డ అనారోగ్యం కారణంగా తల్లిదండ్రులు తమ ఇద్దరు కుమార్తెలు, బంధువులు సెంథిల్ మనోహరన్ (70), అంకాలేశ్వరి (58)తో కలసి రామనాథపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం కారులో తంగచ్చిమఠం బయల్దేరారు. కారు ముందు తిరుపత్తూర్ నుంచి రామేశ్వరం వెళ్తున్న ప్రభుత్వ బస్సులో ప్రయాణికుడు హఠాత్తుగా వాంతులు చేసుకోవడంతో డ్రైవర్ ఒక్కసారిగి బ్రేక్ వేసి బస్సు ఆపాడు. అంతలో వెనుక నుంచి వస్తున్న కారు బస్సును ఢీకొనడంతో రాజేష్, దర్శినిరాణి, ప్రణవిక, బంధువులు సెంథిల్ మనోహరన్, అంకాలేశ్వరి సహా ఐదుగురు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. కారు డ్రైవర్ బ్రిట్టో (33), రాజేష్ భార్య పాండిసెల్వి, వారి 12 నెలల మగబిడ్డకు గాయాలుకాగా, చుట్టుపక్కల వారు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


కడలాడిలో ప్రమాదానికి గురైన కారు


మృతిచెందిన తులసీనాథన్, సాస్తిక (ఫైల్ ఫొటో)

కడలూరు సమీపంలో...

కడలూరు ఆల్‌పేట కామరాజ్ నగర్‌కు చెందిన సెల్వరాజ్ (40), భార్య ప్రియ (36), కుమార్తె రాజదీపతో కలసి శనివారం సాయంత్రం బైక్‌లో కుల్లంచావిడి నుంచి వడలూరు బయల్దేరాడు. తొప్పుకొల్ల పుత్తుమారియమ్మన్ ఆలయ సమీపంలో వస్తున్న బైక్‌ను వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో సెల్వరాజ్, రాజదీప సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, ప్రియకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కుల్లంచావిడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మదురై జిల్లాలో... : మదురై జిల్లా మమ్సాపురం రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన తులసీనాథన్(33)-విజయలక్ష్మి దంపతులకు శాస్తిక(6) కుమార్తె,నాలుగేళ్ల కుమారుడున్నాడు.శనివారం ఉదయం కుటుంబంతో బైక్‌పై వెళ్లిన తులసీనాథన్, తిరుమంగళం బైపాస్ రోడ్డు ప్రాంతంలో బైక్‌ఆపి, సరుకులు కొనేందుకు కుమార్తె శాస్తికతో కలసి బైక్ దిగగా, విజయలక్ష్మి తన కుమారుడితో కలసి బైక్ నడుపుకుంటూ ఇంటికి వెళ్లింది. తులసీనాథన్ కుమార్తెతో కలసి సర్వీసు రోడ్డులో నడిచివెళుతున్న సమయంలో చెన్నై ఐటీ సంస్థలో పనిచేస్తున్న నాగర్‌కోయిల్‌కు చెందిన ఎత్తిన్ జోసఫ్ (30) నడుపుతున్న కారు తిరుమంగళం బైపాస్ రోడ్డుపై వెళుతూ హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న డివైడర్ ఢీకొని సర్వీస్ రోడ్డులో నడచి వెళ్తున్న తండ్రీకూతుళ్లను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో శాస్తిక ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తులసీనాథన్ సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన తిరుమంగళం నగర పోలీసులు, ఎత్తిన్ జోసఫ్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

డీఎంకే పాలనలోనే ఆలయాలకు మహర్దశ

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారంలోకి వచ్చాకే ప్రాచీన ఆలయాలన్నింటికీ మహాకుంభాభిషేకాలు జరుగుతున్నాయని దేవాదాయి శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అన్నారు. తిరునల్వేలి సమీపంలో వెయ్యేళ్లనాటి ప్రాచీన ఆలయం మానూరు అంబలవాణ స్వామి ఆలయానికి 117 సంవత్సరాల తర్వాత ఆదివారం ఉదయం జరిగిన మహా కుంభాభిషేకంలో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాల ప్రకారమే రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు జీర్ణోద్ధరణ జరిపి కుంభాభిషేకాలు జరిపిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ కుంభాభిషేకాలు జరుపుకున్న ఆలయాల సంఖ్య 2098కి చేరిందన్నారు.


తిరునల్వేలి సమీపంలోని మానూరు అంబలవాణ స్వామి ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి పీకే శేఖర్‌బాబు

రాష్ట్రానికి 13 వరకు వర్షసూచన

పెరంబూర్, సెప్టెంబరు 8: తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 13వ తేది వరకు వర్షాలు కురవనున్నాయి. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి రానున్న మూడు రోజుల్లో పశ్చిమ బెంగాల్-ఒడిశా ప్రాంతాల మీదుగా పశ్చిమ-వాయువ్య దిశగా పయనించే అవకాశముంది. అల్పపీడనం ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. నగరంలో పగటి ఉష్ణోగ్రతలు 33-34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

సమాచార దర్శిని

14,15 తేదీల్లో ఊటీ-కున్నూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 8: ఓనం పండుగ సందర్భంగా ఊటీ-కున్నూర్ మధ్య ప్రత్యేక కొండ రైలు సేవలు అందుబాటులో ఉంటాయని సేలం రైల్వే డివిజన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఊటీ-కున్నూర్-ఊటీ మధ్య తలా ఒకసారి, ఊటీ-గెత్తి మధ్య మూడు ప్రత్యేక కొండ రైళ్లు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

నేటినుంచి చెన్నై ఫుట్‌బాల్ లీగ్

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: చెన్నై ఫుట్‌బాల్ లీగ్ పోటీలు సోమవారం కీల్పాక్కంలోని నెహ్రూ పార్క్ మైదానంలో ప్రారంభం కానున్నాయి. 14వ తేది వరకు జరుగనున్న ఈ పోటీల్లో 14 ఏళ్లలోపున్న ప్రభుత్వ, కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సీజన్‌లో 46 పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు లేటెంట్ వ్యూ అనలైటిక్స్ సంస్థ నిర్వాహకులు తెలిపారు.

రూ.462 కోట్లతో సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్క్

పెరంబూర్, సెప్టెంబరు 8: ధర్మపురి జిల్లాలో రూ.462 కోట్లతో 1,724 ఎకరాల విస్తీర్ణంలో సిప్కాట్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకానుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇందుకోసం పర్యావరణ అనుమతులు కోరుతూ సిప్కాట్ సంస్థ కేంద్ర పర్యావరణ, వాతావరణ మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసింది. ధర్మపురి జిల్లాలో ఏర్పాటుకానున్న ఈ ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా 18,300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్రప్రభుత్వం తెలిపింది.

సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: గ్రూప్-1 పోస్టుల సర్టిఫికెట్ల పరిశీలన, ప్రిలిమినరీ పరీక్షకు తాత్కాలిక అనుమతి పొందిన అభ్యర్థులు ఈ నెల 16వ తేది వరకు తమ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. ప్రిలిమినరీ పరీక్షకు రూ.200 ఫీజు చెల్లించాలి. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని వారు అపరాధం లేకుండా 15వ తేదిలోపు చెల్లించాలని టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది. అలాగే, 16వ తేది సాయంత్రం లోగా సర్టిఫికెట్లు స్కాన్ చేసి టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

ట్రాఫిక్ పోలీసులకు వినికిడి పరికరాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: ట్రాఫిక్ పోలీసులకు వినికిడి పరికరాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. చెన్నై పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలోని 55 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలో 2,500 మంది పోలీసులు 244 ప్రాంతాల్లో సిగ్నల్స్ వద్ద షిఫ్టు విధానంలో పనిచేస్తున్నారు. శబ్దకాలుష్యం వల్ల వీరికి వినికిడి లోపం కలుగుతున్నట్లు గుర్తించిన పోలీసు శాఖ ఆధునిక వినికిడి పరికరాలను నుంగంబాక్కంలోని నాయిస్ సంస్థ ద్వారా త్వరలో అందజేసేందుకు చర్యలు చేపట్టింది.

రామనాథపురం తీరంలో పడవ సవారీ

పెరంబూర్, సెప్టెంబరు 8: రామనాథపురం జిల్లాలోని తీరప్రాంతాలకు పర్యాటకుల సౌకర్యార్థం పడవ సవారీ ప్రారంభించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, రామేశ్వరం, పాంబన్, దేవిపట్టణం తదితర ప్రాంతాల్లో పడవ సవారీ అందుబాటులోకి రానుంది. మూడు గంటలు సాగే ఈ సవారీలో 50 మంది ప్రయాణించేలా బోట్లు ఏర్పాటుకానున్నాయి. పడవ సవారీకి ఆసక్తి చూపే సంస్థలు అక్టోబరు 7వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సచివాలయం ప్రకటన విడుదల చేసింది.

డిసెంబరులో చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభం

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రోడ్డు డిసెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ అధికారులు తెలిపారు. దక్షిణ భారత దేశంలో తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానిస్తూ రూ.17,930 కోట్లతో చెన్నై-బెంగళూరు మధ్య 258 కి.మీ ఎక్స్‌ప్రెస్ వే ఏర్పాటవుతోంది. రాష్ట్రంలో శ్రీ పెరుంబుదూర్‌లో ప్రారంభమై కర్ణాటక రాష్ట్రం హోస్‌కోటలో ముగుస్తుంది. ఈ ఎనిమిది లేన్ల రహదారి పనులు తుదిదశకు చేరుకున్నాయని డిసెంబరులో ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

యునానీ, సిద్ధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: సిద్ధ, యునానీ, హోమియోపతి పీజీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో కోర్సుకు వేర్వేరుగా ఈ నెల 20వ తేది వరకు దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి 'కార్యదర్శి, పరీక్షల కమిటీ, భారత వైద్యం, హోమియోపతి డైరెక్టరేట్, అరింజర్ అన్నా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం, అరుంబాక్కం, చెన్నై-106' చిరునామాకు పంపించాలి. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ, బీసీఎం, ఎంబీసీ, టీఎన్‌సీ వర్గాలకు చెందిన వారు రూ.3,000, ఎస్సీ, ఎస్సీ (ఏ), ఎస్టీ వర్గాల వారు చెల్లించనవసరం లేదు. అఖిల భారత కోటా సీట్లకు రూ.1,000, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు రూ.5,000 రుసుము చెల్లించాలి.

నేటినుంచి మూడు కొత్త సబర్బన్ రైళ్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: చెన్నై సెంట్రల్-తిరువళ్లూర్, సెంట్రల్-ఆవడి మధ్య సోమవారం నుంచి మూడు కొత్త సబర్బన్ రైళ్లు ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ప్రయాణికుల అవసరాన్ని బట్టి అదనపు సేవలను దక్షిణ రైల్వే నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, ఆవడి నుంచి ఉదయం 9.50 గంటలకు సెంట్రల్‌కు కొత్త సబర్బన్ రైలు బయల్దేరుతుంది. సెంట్రల్ నుంచి 10.40 గంటలకు, మరో మార్గంగా తిరువళ్లూర్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు సెంట్రల్‌కు రైళ్లు నడువనున్నాయి. గుడువాంజేరి నుంచి రాత్రి 8.55, 10.10, 10.25, 11.20 గంటలకు తాంబరంకు నడిచే సబర్బన్ రైళ్లు చెన్నై బీచ్ వరకు పొడిగించారు. సెంట్రల్ నుంచి ఉదయం 7.40 గంటలకు తిరుత్తణికి వెళ్లే సబర్బన్ రైలు ముందుగా 7.25 గంటలకు, చెన్నై బీచ్ నుంచి తిరువళ్లూర్‌కు రాత్రి 7.10 గంటలకు బయల్దేరే రైలు 10 నిముషాలు ముందుగా 7 గంటలకు, సెంట్రల్ నుంచి తిరుత్తణికి రాత్రి 7.45 వెళ్లే సబర్బన్ రైలు 7.35 గంటలకు బయల్దేరనున్నాయి. చెన్నై సెంట్రల్ నుంచి తిరువళ్లూర్‌కు రాత్రి 7.10 గంటలకు బయల్దేరే రైళ్లు ఆలస్యంగా 8.05 గంటలకు బయల్దేరనున్నాయి.

బకాయి వసూళ్ల గడువు పొడిగింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: బకాయిల వసూళ్ల గడువును సహకార శాఖ పొడిగించింది. 2022 డిసెంబరు వరకు సహకార బ్యాంకుల్లో పెండింగ్‌లో ఉన్న రుణాలకు రూ.900 కోట్లు వసూలు చేసేందుకు నిర్ణయించగా రూ.300 కోట్లు మాత్రమే వసూలైంది. దీంతో ఒప్పంద అవకాశాన్ని ఈ నెల 12వ తేది వరకు, రుణాలు చెల్లించేందుకు అవకాశాన్ని 2025 మార్చి 12వ తేది వరకు సహకార శాఖ పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

స్థానిక ఎన్నికలకు ఈసీ సమాయత్తం

● ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశం



పెరంబూర్, సెప్టెంబరు 8: రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించేలా, ఓటర్ల జాబితాలో సవరణ చేసి సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ఐదేళ్లకు ఒకసారి కార్పొరేషన్లు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం 2019లో 27 జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. కొత్తగా ఆవిర్భవించిన జిల్లాల్లో వార్డుల పునర్విభజన పూర్తిచేసి, 2021లో డీఎంకే ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత 9 జిల్లాల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది డిసెంబరులో 27 జిల్లాలో స్థానిక సంస్థల పదవీకాలం ముగియనుంది. మిగిలిన 9 జిల్లాల్లోని పదవీకాలం 2026 వరకు ఉంది.. అదే సమయంలో 2026లో శాసనసభ ఎన్నికలు రానుండడంతో, అంతకు ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని అధికార డీఎంకే నిర్ణయించింది. ఆ ప్రకారం, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి రాసిన లేఖలో... స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు యంత్రాలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం బ్యాలెట్ బాక్స్‌లున్న గోదాములకు వెళ్లి వాటిని పరిశీలించాలని, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయాలని తెలిపింది. అలాగే, ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈసీ ఉత్తర్వులు జారీచేసింది.

స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ పెంపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీరికి రూ.20,000 ఉన్న పింఛన్ రూ.21,000లకు, వారి వారసుల కుటుంబ పింఛన్ రూ.11,000 నుంచి 11,500లకు పెంచనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ ప్రకారం, పింఛన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే, వీర పాండ్య కట్టబొమ్మన్, వావూ చిదంబరనాథ్, మరుదు సోదరులు, ముత్తురామలింగ విజయరఘునాథ సేతుపతి వంశీకులకు ప్రత్యేక పింఛన్ నెలకు రూ.10,000 నుంచి రూ.10,500లకు ప్రభుత్వం పెంచింది.

అక్టోబరు 21 నుంచి పాలిటెక్నిక్ సెమిస్టర్

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: పాలిటెక్నిక్ సెమిస్టర్ పరీక్షలు అక్టోబరు 21వ తేది నుంచి ప్రారంభం కానున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్, సాంకేతిక పరీక్షల బోర్డు డైరెక్టర్ అబ్రహాం తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్‌ను సాంకేతిక విద్య డైరెక్టరేట్ వెబ్‌సైట్‌లో విడుదల చేశామని తెలిపారు. ఆ ప్రకారం, ఈ పరీక్షలు అక్టోబరు 21 నుంచి నవంబరు 9వ తేది వరకు జరుగుతాయని, ప్రాక్టికల్స్ అక్టోబరు 7వ తేది నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. సెమిస్టర్ పరీక్షలు ముగిసి డిసెంబరు 2వ తేది నుంచి తరగతులు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, సెప్టెంబరు 8: సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక 16,794 ఘనపుటడుగులకు తగ్గింది. కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంలోని శనివారం సాయంత్రం 18,553 ఘనపుటడుగులుండగా, ఆదివారం ఉదయం 16,794 ఘనపుటడుగులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాంలో 115.93 అడుగులు (పూర్తి సామర్థ్యం 120 అడుగులు), 87.12 టీఎంసీల నీరుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

ఒకేరోజు 871 పార్క్‌ల పునరుద్ధరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: చెన్నై కార్పొరేషన్‌లో ఉన్న 871 పార్క్‌ల్లో శుక్రవారం ఒకేరోజున పారిశుధ్య పనులు సహా పునరుద్ధరణ జరిగింది. జీసీసీ ఆధ్వర్యంలో 165 పార్క్‌లు, దత్తత విధానంలో 88, పర్యవేక్షణ ఒప్పంద పద్ధతిలో 616, మెట్రో రైలు పర్యవేక్షణలో రెండు పార్క్‌లు మొత్తం871 పార్క్‌ల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పారిశుధ్య పనులు, మరమ్మత్తులు చేపట్టగా, విరిగిన కుర్చీలు, ధ్వంసమైన ఫుట్‌పాత్‌లు ప్రహరీగోడ, క్రీడా ఉపకరణాలు, కృత్రిమ ఫౌంటైన్, టాయిలెట్ వంటి వాటికి మరమ్మతులు చేపట్టారు.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 8: రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో టీఎన్‌పీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ తదితర పోటీ పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సచివాలయం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... పాత వాషర్‌మెన్‌పేటలోని సర్ త్యాగరాజ కళాశాలలో 500 మంది, చేపాక్కం సమీపంలోని రాజధాని కళాశాలలో 300 మందికి శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు నెలలు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు పూర్తయి, టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఈ శిక్షణకు హాజరుకావచ్చు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10 నుంచి 24వ తేది వరకు www.cecc.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 044-25954905, 28510537 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

కొల్లిడం నదిలో ఐదుగురి గల్లంతు

● రెండు మృతదేహాలు లభ్యం

పెరంబూర్, సెప్టెంబరు 8: కొల్లిడం నదిలో ఈతకొడుతున్న చెన్నైకి చెందిన ఐదుగురు యువకులు గల్లంతు కాగా, ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. తంజావూరు జిల్లా తిరుకాట్టుపల్లి సమీపం పూండి మాత ఆలయానికి ఎగ్మూర్ నెహ్రూ పార్క్ హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన ఛార్లెస్ కుమారులు ఫ్రాంక్లిన్ (23), ఆంటోని (20) స్నేహితులు కిషోర్ (20), కలైఅరసన్ (20), మనోహరన్ (20) కలసి వెళ్లారు. వారంతా కొల్లిడం నదిలో స్నానాలు చేస్తుండగా లోతైన ప్రాంతంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న తిరుకాట్టుపల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని నదిలో గాలించి కలైఅరసన్, కిషోర్ మృతదేహాలను వెలికితీసి, మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై తిరుకాట్టుపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యభిచార కూపం నుంచి విముక్తి

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: వ్యభిచార వృత్తి నుంచి 15 మందికి పోలీసులు విముక్తి కల్పించారు. కోయంబత్తూర్‌లో స్టార్ హోటళ్లలో విదేశీ మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నారనే ఫిర్యాదులందాయి. పోలీసులు హోటళ్లలో తనిఖీ చేసి తేనికి చెందిన సికిందర్ భాష, ఊటీకి చెందిన రాజ్ అనే బ్రోకర్లను అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరో ఏడుగురి కోసం గాలిస్తున్నారు. వారి బారి నుంచి 15 మంది విదేశీ మహిళలకు విముక్తి కల్పించారు. ఈ విషయమై పోలీసులు మాట్లాడుతూ... ఈ ముఠా విదేశీ మహిళలను వ్యభిచార వృత్తిలోకి దింపేందుకు ఆల్ ఇండియా ఏజెంట్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశారని తెలిపారు. ఢిల్లీకి చెందిన కబీర్‌సింగ్ ఆధ్వర్యంలో 117 మంది ఏజెంట్లు ఈ గ్రూప్‌లో ఉన్నారని, రష్యా, ఇండోనేషియ, థాయ్‌లాండ్ వంటి దేశాలతో పాటు భారతదేశానికి చెందిన వారు కూడా ఈ వృత్తిలో ఉన్నారని పేర్కొన్నారు.

శిక్షణ పూర్తిచేసుకున్న ఐఏఎస్‌లకు పోస్టింగ్

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: శిక్షణ పూర్తిచేసుకున్న 10 మంది ఐఏఎస్‌లకు సహాయ, సబ్ కలెక్టర్లుగా రాష్ట్రప్రభుత్వం నియమించింది. శిక్షణ పూర్తిచేసుకున్న 2022 సంవత్సరం తమిళనాడు క్యాడర్‌లో ఐదుగురు సహాయ జిల్లా కలెక్టర్లుగా, ఐదుగురు సబ్ కలెక్టర్లుగా నియమితులయ్యారు. వారిలో కులితలై సహాయ కలెక్టర్‌గా స్వాతిశ్రీ, దేవకోట సహాయ కలెక్టర్‌గా ఆకాష్ వెంకట్ వత్సవ్, తిరుకోవిలూరు సహాయ కలెక్టర్‌గా ఆనంద్‌కుమార్ సింగ్, శ్రీ పెరుంబుదూర్ సహాయ కలెక్టర్‌గా ఆషిక్ అలి, ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాళయం సబ్ కలెక్టర్‌గా శివానందం, కుంభకోణం సబ్ కలెక్టర్‌గా హరిద్య విజయన్, కున్నూర్ సబ్ కలెక్టర్‌గా సంగీత, పళని సబ్ కలెక్టర్‌గా కృష్ణకుమార్, పద్మనాభపురం సబ్ కలెక్టర్‌గా వినయ్‌కుమార్ మీనా, పెరియకుళం సబ్ కలెక్టర్‌గా రజత్ ఫిడేస్ నియమితులయ్యారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపులో అధికారులు, సిబ్బంది

వేలూరు, సెప్టెంబరు 8: నగరంలో ఆక్రమణల తొలగింపు ఆదివారం ప్రారంభమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో కొందరు అక్రమ కట్టడాలు, దుకాణాలు ఏర్పాటుచేయడంతో ట్రాఫిక్, పాదచారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై పలువురు కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలతో 2వ మండల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశన్, శానిటేషన్ అధికారి శివకుమార్ నేతృత్వంలో పోలీసుల సాయంతో కార్పొరేషన్ ఉద్యోగులు సైదాపేట మురుగన్ ఆలయం నుంచి మెయిన్ బజార్, లాంగ్ బజార్, మండి వీధుల్లోని ఆక్రమణలు తొలగించారు.

నేటినుంచి 'నాన్ ముదల్‌వన్' శిబిరాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 8: 'నాన్ ముదల్‌వన్' శిబిరాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చెన్నై జిల్లా ఏకీకృత పాఠశాల విద్య, ప్రభుత్వ, ఆదిద్రావిడ పాఠశాలల్లో ప్లస్ టూ ఉత్తీర్ణులైన, ఉత్తీర్ణులు కాని, మధ్యలో మానేసిన విద్యార్థులు ఉన్నత విద్యలో చేరేందుకు నాన్ ముదల్‌వన్-ఉయర్వుక్కు పడి పథకం అమలులో ఉంది. ఈ పథకం కింద ప్రత్యేక శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, సెంట్రల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పెరంబూర్, ఎగ్మూర్, కోడంబాక్కం, వెస్ట్ మాంబళం, అయనావరం, అమింజికరై, పురుషవాక్కం, కొళత్తూర్ ప్రాంత విద్యార్థులకు ఎంజీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నుంచి 19వ తేది వరకు, నార్త్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని తిరువొత్తియూర్, తండయార్‌పేట, మాధవరం, మనలి, రాయపురం ప్రాంత విద్యార్థులకు తిరువొత్తియూర్ వెల్లయ్యన్ చెట్టియార్ పాఠశాలలో ఈ నెల 12 నుంచి 23 తేది వరకు, దక్షిణ రెవెన్యూ డివిజన్‌లో అడయార్, గిండి, షోలింగనల్లూర్, మైలాపూర్ ప్రాంత విద్యార్థులకు సైదాపేట ప్రభుత్వ మోడల్ స్కూలులో ఈ నెల 18 నుంచి 26వ తేది వరకు శిబిరాలు జరుగనున్నాయని, చెన్నై కలెక్టర్ రష్మి సిద్దార్థ్ తెలిపారు.

బీఎండీ పాఠశాలలో చవితి వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

వేలూరు, సెప్టెంబరు 8: స్థానిక గాంధీ నగర్‌లో ఉన్న భగవాన్ మహావీర్ దయానికేతన్ జైన్ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. పాఠశాల అధ్యక్షుడు దిలీప్‌కుమార్ జైన్, సెక్రటరీ రాజేష్‌కుమార్ జైన్, ఉప సెక్రటరీ ఆనంద్ సింగ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ప్రిన్సిపాల్ మాలతి అతిథులకు ఆహ్వానం పలికారు. వినాయకుడి వేషధారణలో విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులను విద్య అడ్వయిజర్ గీత అభినందించగా, ఉప ప్రిన్సిపాల్ పీకే ఉషా వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

అన్నాడీఎంకే సభ్యత్వ కార్డుల పంపిణీ



గుర్తింపుకార్డులు అందజేస్తున్న అప్పు

వేలూరు, సెప్టెంబరు 8: స్థానిక 50వ వార్డులో అన్నాడీఎంకేలో నూతనంగా సభ్యులుగా చేరిన వారికి గుర్తింపు కార్డులు అందజేసే కార్యక్రమం ఓ హోటల్‌లో జరిగింది. కార్యక్రమానికి పార్టీ 50వ డివిజన్ సెక్రటరీ విజయకుమార్ అధ్యక్షత వహించగా, వేలూరు మా నగర జిల్లా సెక్రటరీ అప్పు ముఖ్యఅతిథిగా పాల్గొని 500 మందికి గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బాలచందర్, నగర సెక్రటరీ కుప్పుస్వామి, సైదాపేట డివిజన్ సెక్రటరీ రాధాకృష్ణన్, కాట్పాడి సెక్రటరీ మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వివాదాస్పద ప్రసంగం...

ఎయిర్‌పోర్టులో ప్రవచనకర్త మహావిష్ణు అరెస్టు



మహావిష్ణు - ఎయిర్‌పోర్ట్ వద్ద వేచి ఉన్న పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో విద్యార్థినుల్లో మూఢనమ్మకాలను కలిగించే విధంగా ప్రసంగిస్తూ దివ్యాంగులను సైతం కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన 'పరంపొరుల్ ట్రస్టు' వ్యవస్థాపకుడు, ప్రవచనకర్త మహావిష్ణును మీనంబాక్కం విమానాశ్రయం వద్ద సైదాపేట పోలీసులు అరెస్టు చేశారు. ఆగస్టు 28న మహావిష్ణు సైదాపేట, అశోక్‌నగర్ పాఠశాలల్లో ప్రసంగించారు. అశోక్‌నగర్ పాఠశాలలో ఆయన ప్రసంగిస్తూ పాపపుణ్యాలు, ముందు జన్మ విశేషాలు, గురుకుల విద్యాబోధన, మరుజన్మ, మానవుల మధ్య భగవంతుడు తారతమ్యాలను ఏర్పాటు చేయడానికి గల కారణాలంటూ వివరించారు. అదే సమయంలో దివ్యాంగులనూ కించపరుస్తూ, గత జన్మలో ఘోరమైన పాపాలు చేసినవారే ఈ జన్మలో అవిటివాళ్లుగా జన్మించారంటూ కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పాఠశాలలో పనిచేస్తున్న దివ్యాంగుడైన ఉపాధ్యాయుడు శంకర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దివ్యాంగులను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. అయితే ప్రవచనకర్త మహావిష్ణు తాను దివ్యాంగులను కించపరచటం లేదని, ఆధ్యాత్మిక గ్రంథాల్లో ఉన్న విషయాలనే చెబుతున్నానంటూ సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఆ సందర్భంగా ఉపాధ్యాయుడు శంకర్‌కు, మహావిష్ణుకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక ప్రసారమాధ్యమాల్లో వెలువడటంతో ప్రాథమిక పాఠశాలల విద్యాశాఖ అధికారులు దిగ్భ్రాంతి చెందారు. అమెరికా పర్యటలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఈ సంఘటన తెలియటంతో ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులపై ఆగ్రహం ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్‌లో ప్రవచన ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సంఘటనలు జరుగకుండా నిరోధించాలని పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్‌కు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రవచనకర్త మహావిష్ణుపై వివిధ పోలీసుస్టేషన్లలో దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమ సంఘాలు ఫిర్యాదులు చేశాయి. దీంతో అతడిని విచారించేందుకు తిరుప్పూరు వెళ్ళిన పోలీసులు అక్కడి పరంపొరుల్ ట్రస్టు కార్యాలయం, మహావిష్ణు నివాసంలో శుక్రవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. అక్కడి నిర్వాహకులను పోలీసులు ప్రశ్నించగా మహావిష్ణు ఆస్ట్రేలియా వెళ్ళినట్లు తెలిసింది. ఇక తిరుప్పూరులో తన కోసం పోలీసులు తనిఖీ చేసిన విషయం గురించి తెలుసుకున్న మహావిష్ణు ఆస్ట్రేలియా నుంచి ఓ వీడియో సందేశం వెలువరించారు. అందులో అశోక్‌నగర్ పాఠశాలలో, సైదాపేట పాఠశాలలో తాను మూఢనమ్మకాలను ప్రేరేపించే లా ప్రసంగించలేదని, ఆధ్యాత్మిక గ్రంథాల్లో ఉన్న విషయాలనే చెప్పాన న్నారు. ఆ రెండు పాఠశాలల్లో ప్రసంగ కార్యక్రమాలు ముగియగానే ముందుగా నిర్దేశించినట్లు ఆస్ట్రేలియాలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందు కు ఆగస్టు 30నే వెళ్ళానని, ప్రసారమాధ్యమాల్లో వస్తున్నట్లు తాను పారిపోలేదని స్పష్టం చేశారు. అంతే కాకుండా తాను పోలీసుల విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఆస్ట్రేలియా పర్యటన ముగించుకుని ఈ నెల 7న చెన్నై విమానాశ్రయం చేరుకుంటున్నానని ఆ వీడియో సందేశంలో మహావిష్ణు తెలిపారు. దీంతో సైదాపేట ఏసీపీ శీనివాసన్ నేతృత్వంలో సుమారు వందమంది పోలీసులు శనివారం ఉదయం నుంచే అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుని మహావిష్ణు కోసం ఎదురు చూశారు. అదే సమయంలో మహావిష్ణు ఆదివారం సింగపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం అందింది. దీంతో మహావిష్ణు చెన్నై తిరిగి వస్తారో రారో అని పోలీసుల్లో సందేహం నెలకొంది. చివరకు మహావిష్ణు చెప్పినట్లుగానే శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఆస్ట్రేలియా నుంచి విమానంలో చెన్నై చేరుకున్నారు. వెంటనే పోలీసులు అతడిని అరెస్టు చేసి తీసుకెళ్ళారు. తర్వాత మహావిష్ణును సైదాపేట కోర్టులో హాజరుపరచటంతో మేజిస్ట్రేట్ ఆయనను ఈ నెల 20 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో పోలీసులు ఆయనను జైలుకు తరలించారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు: ఈపీఎస్

ప్యారీస్, సెప్టెంబరు 8: డీఎంకే ప్రభుత్వ అసమర్థపాలన వల్ల రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజలకెవ్వరికీ భద్రత లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మరోసారి ధ్వజమెత్తారు. పుదుకోట సమీపంలోని విరాలిమలై నియోజకవర్గ పరిధిలో ఆదివారం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో 7.5 శాతం రిజర్వేషన్‌లో ఎంబీబీఎస్ కోర్సులో చేరిన ఏడుగురు మెడికోలకు అభినందన సభ మాజీ మంత్రి సి.విజయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎడప్పాడి పళనిస్వామి హాజరై విద్యార్థులకు స్టెతస్కోపు, స్వీట్లు, పుస్తకాలు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 7.5 శాతం రిజర్వేషన్ కింద ఎంబీబీఎస్ కోర్సులో చేరే ఉత్తర్వులను తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చట్టంగా అమలుచేసినట్టు తెలిపారు. కొత్తగా రాజకీయ పార్టీలు ప్రారంభించేందుకు ఎవరికైనా ప్రజాస్వామ్య హక్కు ఉందని అయితే, నటుడు విజయ్ పార్టీ రాజకీయ పార్టీ ప్రారంభించినప్పటి నుంచి ఆయనకు పాలకుల అడ్డంకులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే పాలనలో పరిశ్రమలకు సంబంధించిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసిన అప్పటి ప్రతిపక్ష నేత స్టాలిన్ ఇప్పుడు అమెరికాకు వెళ్లి ఏం సాధించారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. త్వరలో స్థానిక సంస్థలకు జరుగనున్న ఎన్నికలు కానీ, అసెంబ్లీ ఎన్నికలు కానీ ఎదుర్కొనేందుకు అన్నాడీఎంకే సిద్ధంగా ఉందని ఎడప్పాడి పేర్కొన్నారు.

వైభవంగా ఆదిపరాశక్తి ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న ఆదిపరాశక్తి పీఠాధిపతి కేపీ సెంథిల్‌కుమార్

ప్యారీస్, సెప్టెంబరు 8: స్థానిక పెరంబూర్ నియోజకవర్గ పరిధిలోని వ్యాసర్పాడిలో నూతనంగా నిర్మించిన మేల్‌మరువత్తూర్ ఆదిపరాశక్తి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. ఆదిపరాశక్తి పీఠాధిపతి కేపీ సెంథిల్‌కుమార్ పర్యవేక్షణలో ఈ నెల 5వ తేది ఉదయం 11 గంటలకు గురుపూజతో యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ నేతృత్వంలో కలశ స్థాపన, అమ్మవారి విగ్రహాన్ని అర్థ మండపంలో ప్రతిష్ఠించే పూజలు శనివారం జరిగాయి. ఆదివారం ఉదయం పవిత్ర జలాలతో కలశాల ఊరేగింపు అనంతరం భక్తుల దివ్యనామస్మరణ, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రధాన గోపుర కలశాలకు శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, భక్తులకు అన్నదానం చేశారు.

డా.అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్రదానంపై మానవహారం



మానవహారంలో పాల్గొన్న డీఐజీ ఎగల్వన్, డాక్టర్ సౌందరి తదితరులు

చెన్నై, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా నగరానికి చెందిన డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎడ్వర్డ్ ఎలియట్స్ బీచ్ వద్ద నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్మించారు. ఈ కార్యక్రమాన్ని చెన్నై ఇంటెలిజెన్స్ విభాగం డీఐజీ పగల్వన్ ప్రారంభించారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ సిబ్బంది, సభ్యులు, నగరవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డా. అగర్వాల్ ఐ హాస్పిటల్ క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ ఎస్.సౌందరి, డా. అగర్వాల్ ఐ బ్యాంక్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా రథోత్సవం

భక్తులతో కిటకిటలాడిన వేలాంగన్ని, బీసెంట్‌నగర్



బీసెంట్ నగర్ రథోత్సవానికి హాజరైన భక్తులు

ప్యారీస్, సెప్టెంబరు 8 : నాగపట్టినం జిల్లా వేలాంగన్ని, బీసెంట్‌నగర్ ప్రాంతంలో శనివారం రాత్రి నేత్రపర్వంగా రథోత్సవం సాగింది. వేలాంగన్ని దివ్యక్షేత్రంలో గత నెల 29న, అదే విధంగా బీసెంట్‌నగర్‌లో పతాకావిష్కరణతో 11 రోజుల వార్షికోత్సవాలు ఆదివారం అమ్మవారి పట్టాభిషేకం, పతాక అవనతంతో ముగిశాయి. ఉత్సవాల్లో ప్రధాన అంశమైన రథోత్సవం శనివారం రాత్రి నిర్వహించగా, లక్షలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

వినాయక చవితి సందర్భంగా అన్నదానం



అన్నదానం చేస్తున్న డా.సునీల్

పెరంబూర్, సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా మాంబళం నటేశన్ రోడ్డులో 10వ వార్షిక విగ్రహ ఏర్పాటు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో అన్నాడీఎంకే అనుబంధ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.వి.సునీల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ 135వ ఈస్ట్ శాఖ ప్రతినిధి ఎం.చందనలక్ష్మి ఏర్పాటు చేసిన అన్నాదాన కార్యక్రమాన్ని డా.సునీల్ ప్రారంభించారు. 135వ వార్డు శాఖ కార్యదర్శి టి.నగర్ పి.పద్మనాభన్, కె.సూర్యకళ, మాంబళం ఎస్.జయరామన్, ఎం.ఆర్ముగం, టి.విజయ, సుబ్బు మామి, మాంబళం రాణి, ఎం.సూర్య, ఎస్.సురేష్‌కుమార్, గార్డన్ వి.సురేష్‌కుమార్. ఎం.లోకనాథన్, మాంబళం గురుప్రసాద్, ఆర్పీఏ ప్రభాకరన్, ఎంఏ ముస్తఫా ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో అంతర్జాతీయ హాకథాన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెరంబూర్, సెప్టెంబరు 8: స్థానిక వడపళని లోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'స్మార్ట్ ఇండియా హాకథాన్' కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ ఎడ్యుకేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, మహిళల భద్రత, పర్యాటకం, సైబర్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో ఏర్పడే సమస్యలు, పరిష్కారాలు తదితరాలపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి 48 బృందాలు నమోదుచేసుకోగా, 28 టీమ్‌లు అర్హత సాధించాయి. కార్యక్రమంలో ఎస్ఆర్ఎం గ్రూప్ డైరెక్టర్ డా.ఎస్.రామచంద్రన్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డా.సీవీ జయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్ అండ్ ప్లేస్‌మెంట్స్) డా.సి.గోమతి హాకథాన్ ప్రాధాన్యత వివరించారు. టీమ్ ఎంపిక విధానాన్ని ఎస్‌బిమెక్ కో-ఆర్డినేటర్ డా.ఎస్.కార్తీక్ వివరించగా, గరుడ ఏరోస్పేస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అధికారి డా.జీఎన్ మధు, లెనాక్స్ ఇండియా సీనియర్ అనాలసిస్ట్ అభిషేక్ అర్జునన్, ఫోర్డ్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శశిధర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.


పెరవళ్లూరులో పసుపుకొమ్ములతో రూపొందిన గణనాథుడు



కొబ్బరికాయలతో తయారైన విగ్రహం - తిరువిక నగర్ 5001 బిస్కెట్ ప్యాకెట్లతో రూపొందించిన విగ్రహం


నెమలి పింఛాలతో తయారైన వినాయకుడు

ఓ బొజ్జగణపయ్య... నీ బంటు మేమయ్యా...

- వాడవాడలా గణపతికి ప్రత్యేక పూజలు
- వీధివీధిలో మండపాలు
- రాష్ట్ర వ్యాప్తంగా చవితి సందడి


కొళత్తూరులో ఇత్తడి దీపాలు, శంఖాలతో తయారైన 40 అడుగుల గణపతి


ఛత్రం పట్టి కొలువుదీరి..


అర్ధనారీశ్వరుడిగా గణనాథుడు

ప్యారీస్, సెప్టెంబరు 8: ఆదిదంపతుల తనయుడు, ప్రమధ గణనాథుడు వినాయకుడు వాడవాడలా పూజలందుకుంటున్నారు. వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో పెట్టిన గణనాథుడి విగ్రహాలకు శనివారం నుండి పూజలు ప్రారంభమయ్యాయి. విఘ్నాలు తొలగి, శుభాలు కలుగజేయాలని కోరుతూ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో లంబోదరుడికి పూజలు చేశారు. మండపాలన్నీ వినాయకచవితి సందర్భంగా విద్యుద్దీపాలతో తోరణాలతో శోభాయమానంగా ప్రకాశించాయి. పిల్లలు, పెద్దల సందడితో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. గణేశ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఈ యేడాది కూడా పోటీపడి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చశారు. మూడు నుంచి తొమ్మిది రోజులవరకు పలు ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. సంగీత భరతనాట్య ప్రదర్శనలతో వేదిక ప్రాంతాలు హోరెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చతుర్థి వేడుకలకు ప్రసిద్ధి చెంది, దక్షిణ కైలాసంగా పేరొందిన తిరుచ్చి మలకోట తాయుమానస్వామి ఆలయంలో ఉచ్చి పిళ్లయార్ సన్నిధిలో శనివారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామునే ఆలయ ఏనుగు లక్ష్మికి గజ పూజ చేశారు. అనంతరం ఉచ్చి పిళ్లయార్, మాణిక్య వినాయక స్వాములకు చందనాలంకరణ, 150 కిలోల భారీ కుడుము నైవేద్యం పెట్టారు. అదే విధంగా శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపంలో ఉన్న పిళ్ళయార్‌పట్టి కర్పగ వినాయక ఆలయంలో జరిగిన తీర్థవారీలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయంలో మూలవిరాట్టుకు భారీ సైజులో చేసిన కుడుమును నైవేద్యంగా సమర్పించారు. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలోని ముక్కురిణి వినాయకుడికి కూడా రకరకాల నైవేద్యాలు నివేదించి పూజలు నిర్వహించారు.

వెల్లివిరిసిన మతసామరస్యం...

వినాయక చవితి పండుగ సందర్భంగా స్వామివారికి ముస్లిం సోదరులు సారె సమర్పించి మతసామరస్యానికి అద్దం పట్టారు. కోయంబత్తూరు జిల్లా మాట్టుసంత ప్రాంతానికి చెందిన ముస్లింలు పండ్లు, మిఠాయిలు, మట్టితో తయారు చేసిన బుల్లి వినాయకుడి ప్రతిమలను ఊరేగింపుగా వేదికవద్దకు తీసుకువచ్చారు. అక్కడ జరిగిన ప్రత్యేక పూజల్లో ముస్లింలను వ్యాపారులు ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.



పండ్ల గణపతి


కొళత్తూరు జీకేఎం కాలనీలో పదివేల లడ్డూలతో తయారైన లంబోదరుడు


అరటిపూలు, కొబ్బరికాయలతో తయారైన గణపతి


ఇత్తడి పాత్రతో తయారైన విగ్రహం


అశ్వారూఢుడైన గణపయ్య


మైలాపూరు చిత్రకుళం వద్ద వినాయకుడు

గణపతి పూజలో గజరాజులు



పెరంబూర్, సెప్టెంబరు 8: ముదుమలై తెప్పకాడు పెంపుడు ఏనుగుల శిబిరంలో వినాయక చవితి వేడుకలు కోలాహలంగా జరిగాయి. పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకుల నడుమ శిబిరంలోని ఏనుగులతో గణపతికి పూజలు చేయించారు. చవితి సందర్భంగా శనివారం నీలగిరి జిల్లా తెప్పకాడు శిబిరంలో సంరక్షిస్తున్న ఏనుగులు కూడా వేడుకల్లో పాల్గొన్నాయి. ఏనుగులకు స్నానం చేయించి కుంకుమ, చందనం అలంకరణతో ఊరేగింపుగా శిబిరం ప్రాంగణంలో ఉన్న వినాయకుడి ఆలయానికి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం 'మసిని' అనే ఏనుగు గంట మోగించి, ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసింది. అనంతరం దీపారాధన చేశారు. ఈ సందర్భంగా ఏనుగులకు పొంగలి, చెరకు, కొబ్బరి, బెల్లం వంటి ప్రత్యేక ఆహారం అందజేశారు.

వర్సిటీ పురోభివృద్ధిలో ప్రొఫెసర్ల కృషి ప్రశంసనీయం

- వేల్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతా గణేశ్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

అడయార్, సెప్టెంబరు 8: వేల్స్ విశ్వవిద్యాలయం పురోభివృద్ధికి ప్రొఫెసర్ల కృషి, అంకితభావమే కారణమని వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ అడ్వాన్స్ స్టడీస్ యూనివర్సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతా గణేశ్ అన్నారు. ఈ వర్సిటీ ప్రాంగణంలోని శివాలయ ఎరీనాలో గురుపూజోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో తమతమ రంగాల్లో ప్రతిభ కనబరచిన ప్రొఫెసర్లను ఎంపిక వారిని ఘనంగా సన్మానించి, అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతా గణేశ్ మాట్లాడుతూ, ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో ప్రొఫెసర్ల కృషి, అంకితభావం ఎంతగానో ఉందన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించేలా గుర్తించి, వారికి ఈ అవార్డుల ఇచ్చి సన్మానం చేసినట్టు పేర్కొన్నారు. తమ ఇన్‌స్టిట్యూట్ లింగ సమానత్వాన్ని కొనసాగిస్తూ ఉన్నత విద్యా ప్రమాణాలనందిస్తుందని ఆమె వెల్లడించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.


స్థానిక పుళల్ కావాంగరైలో తెలుగు పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం


కాకలూరు సెల్వగణపతి దేవాలయంలో మహా అభిషేక పూజలు


ట్రిప్లికేన్‌లో శివమేళంతో హోరెత్తిస్తున్న కళాకారులు

మిన్నంటిన చవితి సంబరాలు

ప్యారీస్, సెప్టెంబరు 8: ఊరంతా కలసి వినాయక చవితి పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. స్థానిక పుళల్ కావాంగరై తెలుగు పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్పగ వినాయకుడి ప్రతిమను 8వ సంవత్సరం ప్రతిష్ఠించారు. శుక్రవారం హోమం, ప్రసాద వినియోగం, శనివారం మహా గణపతి పూజ, ఆదివారం ఉదయం లడ్డు వేలం, ఉట్లోత్సవం, అన్నదానం అనంతరం మహా గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జన కార్యక్రమం జరిగింది. సంఘ అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, నిర్వాహకులు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో నిర్వహించిన మూడు రోజుల కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాకలూరులో...

తిరువళ్లూర్ జిల్లా కాకలూరులోని సెల్వ గణపతి ఆలయంలో 38వ వార్షిక వినాయక చతుర్థి వేడుకల సందర్భంగా స్వామివారికి శనివారం ప్రత్యేక అభిషేకం, అలంకారం, అర్చన నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ స్థాపకుడు శ్రీ మన్నారాయణ, కమిటీ సభ్యులు టి.మునినాదన్, కె.వెంకటేశన్, జి.కృష్ణన్, ఆర్.రాజా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణి చేశారు.

ట్రిప్లికేన్‌లో...

ట్రిప్లికేన్ సైదోజీ లైన్‌లో సెల్వవినాయకాలయం 32వ వార్షిక చవితి వేడుకల సందర్భంగా శివమేళం, శివ తాండవంతో కళాకారులు హోరెత్తించారు. ఏఐటీఎఫ్ సెంట్రల్ చెన్నై అధ్యక్షుడు కుంకు దశరధరావు అధ్యక్షతన గణపయ్యకు ఉండ్రాళ్ళు, కుడుములు, పూర్ణాలు, లడ్డు తదితర 9 రకాల వంటకాలు నివేదించారు. నవధాన్యాలతో అభిషేకించారు. కళాకారులు శివమేళం పేరుతో భక్తిసంగీతం అందించి నృత్యాలతో హోరెత్తించారు. ఇ.వెంకటేశన్, కేవీ యువరాజ్, ఆర్.సురేష్, బి.సతీష్, వీబీ భాస్కర్ కన్నన్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చవితిని పురస్కరించుకొని ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదాలను పంపిణి చేశారు.

ఒకే రాత్రిలో జరిగే కథతో 'హెచ్.ఎం.ఎం'


'హెచ్.ఎం.ఎం'లో సుమీరా

దట్టమైన అడవిలో ఉన్న ఒకే ఒక ఇంటిలో జరిగే మూడు హత్యల వెనుకవున్న మర్మమేంటి అనే ఇతివృత్తంతో ఒకే రోజు రాత్రిలో జరిగే కథతో రూపొందిన చిత్రం 'హెచ్.ఎం.ఎం'. బ్రైట్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మితమైన ఈ సినిమాలో నరసింహన్, సుమీరా, శివ, షర్మిల, అనురాగ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. పురూష్ నేపథ్య సంగీతం అందించిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, నిర్మాణం, దర్శకత్వం నరసింహన్ ఫక్రీసామి. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఈ మూవీలో ఒక్క పాట కూడా లేదు. సినిమాలోని సన్నివేశాలన్నీ రాత్రి పూటే చిత్రీకరించాం. అడవిలో ఉన్న ఇంటిలో ఒకే రాత్రి మూడు హత్యలు జరుగుతాయి. ఈ హత్యలు ఎందుకు జరిగాయి? ఎవరు చేశారు? ఈ హత్యల వెనుక ఉన్న మర్మమేంటి? అనే అంశాలు ఎంతో ఆసక్తికరంగా ప్రేక్షకుడు ఉత్కంఠకు గురిచేసేలా చిత్రీకరించాం. నేపథ్య సంగీతం సినిమాకు ఎంతో బలం చేకూర్చనుంది. అన్ని నిర్మాణ పనులను పూర్తి చేసి ఈ నెల 31వ తేదీ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

బుల్లితెరపై రాణిస్తున్న 'కలవాణి-2' విలన్


ఎలాన్ మస్క్ - దురై సుధాకర్

గతంలో వచ్చిన 'కలవాణి-2' చిత్రంలో విలన్‌గా నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన దురై సుధాకర్ ఇపుడు బుల్లితెరపై కూడా రాణిస్తున్నారు. ప్రముఖ టీవీలో ప్రసారమవుతున్న 'మూండ్రు ముడిచ్చు' అనే సీరియల్‌లో ఒక ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఆయన పాత్ర ప్రతి ఒక్కరినీ ఆలరిస్తుంది. దీంతో ఆయనకు బుల్లితెరపై అనేక వరుస అవకాశాలు వస్తున్నాయి. మరోవైపు, సిల్వర్ స్క్రీన్‌పై కూడా తన ప్రతిభ నిరూపించుకుంటున్నారు. ఈయన హీరోగా నటించిన 'తప్పాట్టం' చిత్రంతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఈ సినిమాలోని ఒక సన్నివేశం ఫొటోను ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ఎలాన్ మస్క్ తన ట్విటర్ ఖాతాలో షేర్ చేశారు. దీంతో దురై సుధాకర్ రాత్రికి రాత్రి అంతర్జాతీయంగా ఫేమస్ అయ్యారు. దీంతో ఆయనకు చిత్రపరిశ్రమలో కూడా వరుస సినీ అవకాశాలు వస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బేబీ లక్షణ రిషి ప్రధాన పాత్రలో 'ఎంగ అప్పా'


'ఎంగ అప్పా'లో లక్షణ రిషి

తమిళ చిత్రపరిశ్రమలో బాలనటిగా ప్రతి ఒక్కరి నుంచి ప్రశంసలు అందుకుంటున్న బేబీ లక్షణ రిషి ప్రధాన పాత్రలో 'ఎంగ అప్పా' పేరుతో ఒక చిత్రం రూపుదిద్దుకుంది. ఈ నెల 18వ తేదీ విడుదలకు సిద్ధమైన ఈ చిత్రంలో ఐదేళ్ళ లక్షణ రిషి.. తండ్రిని దైవంగా భావించి ఓ పాడుతుంది. ఈ పాటను విజయ్ టీవీ సూపర్ సింగర్ ప్రియాంక నేపథ్యగానం చేశారు. ఈ పాట సినిమాకే హైలెట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం చెబుతోంది. డాక్టర్ ఎస్.వి.రిషి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఇప్పటికే చిత్రపరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖుల కోసం ప్రదర్శించారు. ఈ చిత్రంలో బాలనటి నటన చూసి ఆశ్చర్యపోవడంతో పాటు భవిష్యత్ కథానాయికి అంటూ ప్రశంసల వర్షం కురిపించడం గమనార్హం. తమిళనాడు, కేరళ రాష్ట్రంలో ఎంతో అందమైన లొకేషన్లలో సినిమా షూటింగ్ పూర్తి చేశారు. అప్పా మీడియా పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రాన్ని అనీషా సతీష్ నిర్మించారు.

షూటింగుల బంద్ నిర్ణయంపై పునఃపరిశీలన చేయండి

- నడిగర్ సంఘం వినతి

నవంబరు ఒకటో తేదీ నుంచి సినిమా షూటింగులను నిలిపివేయాలని తీసుకున్న నిర్ణయంపై పునఃపరిశీలన చేయాలని తమిళ చిత్ర నిర్మాతల మండలికి నడిగర్ సంఘం విజ్ఞప్తి చేసింది. నటీనటుల పారితోషికాలు, ఓటీటీ, శాటిలైట్ రైట్స్ తదితర సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న లక్ష్యంతో నవంబరు ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సినిమా షూటింగులను నిలిపివేయాలని నిర్మాతల మండలి సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో కోలీవుడ్‌లో బంద్ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో నడిగర్ సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, నిర్మాతల సంఘం అధ్యక్షుడు తేనాండల్ మురళి రామస్వామి సారథ్యంలో నిర్వాహకుల కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఇందులో ఆగస్టు నెల 18వ తేదీ నిర్మాతల మండలి, నడిగర్ సంఘం నిర్వాహకుల మధ్య జరిగిన సమాచాలోచన సమావేశంలో నటీనటులు - నిర్మాతల మధ్య జరిగిన 11 అవగాహన ఒప్పంద పత్రాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుని, వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ధనుష్ వంటి పలువురులు హీరోల వల్ల నిర్మాతలు ఎదుర్కొంటున్న సమస్యతో పాటు ఇతర అంశాలను కూడా నిర్మాతల మండలి మరోమారు నడిగర్ సంఘం దృష్టికి తీసుకెళ్ళింది. ఈ సమావేశ చర్చల అనంతరం ఇరు సంఘాల నిర్వాహకులు మరోమారు సమావేశమై, కొత్తగా అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకోవాలని నిర్ణయించారు. అదే సమయంలో నడిగర్ సంఘం ప్రతినిధులు కూడా నిర్మాతల మండలికి ఒక విజ్ఞప్తి చేసింది. నవంబరు ఒకటో తేదీ నుంచి షూటింగుల నిలిపివేత నిర్ణయంపై పునఃపరిశీలన చేయాలని నడిగర్ సంఘం కోరింది.


కదిరేశన్, మురళి, పూచ్చి మురుగన్ తదితరులు